సాక్షి ప్రకాశం

శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025



ధాన్యం రైతుకు దిక్కెవరు..?

జిల్లాలో ధాన్యం రైతు పరిస్థితి దయనీయంగా మారింది. గిట్టుబాటు ధరలు లేక, దిగుబడి రాక అల్లాడుతున్నారు. దళారులకు పంటనమ్ముకుని దగా పడుతున్నారు. - IIలో..



కట్టుకథలు చెప్పొద్దు

ప్రజల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా కారణాలడిగితే కట్టుకథలు చెప్పొద్దంటూ అధికారులను కలెక్టర్ హెచ్చరించారు. - IIలో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33/24

ఉదయం పొగమంచు ఉంటుంది. ఎండ తీవ్రత స్వల్పంగా పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రైతు వ్యతిరేక కుట్రలను తిప్పికొడతాం

● సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు



మాట్లాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ రంగారావు

ఒంగోలు టౌన్: రైతాంగ ఉద్యమాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రపూరిత దుష్ప్రచారాలను తిప్పికొట్టేందుకు మార్చి 5వ తేదీ జిల్లా కేంద్ర మైన ఒంగోలు కలెక్టరేట్ వద్ద, మార్చి 10 తేదీ గుంటూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి ధర్నాలను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని మాదాల నారాయణస్వామి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న రైతు ఉద్యమాలను విచ్ఛిన్నం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. గిట్టుబాటు ధరలపై కుదుర్చుకున్న ఒప్పందాలపై తప్పుడు ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేసేంత వరకు ఉద్యమం ఆగదన్నారు. రాష్ట్రంలో బ్లాక్ బర్లీ, వైట్ బర్లీ పొగాకు ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయిందని, వ్యాపారులు గతేడాది కంటే 4 నుంచి 5 వేల వరకు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీనివలన రైతులు చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జామాయిల్, సుబాబుల్ కర్రలను పెరిగిన ధరలకు అనుగుణంగా కొనుగోలు చేయకుండా ఐటీసీ కూటమి మాటున వెయ్యి నుంచి రూ.1,500 తక్కువకు కొనుగోలు చేయడం దుర్మార్గమని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి వీరారెడ్డి మండిపడ్డారు. ప్రకాశం, కృష్ణా జిల్లాల సుబాబుల్ రైతులు ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాలో సాగు చేస్తున్న తేజ మిర్చికి గుంటూరు మిర్చి మార్కెట్‌లో 13 నుంచి 14 వేల రూపాయల ధర పలుకుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.11,781 మద్దతు ధర ప్రకటించడాన్ని తప్పుబట్టారు. విదేశాల నుంచి సరుకులు దిగుమతి చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం రైతులను నిండాముంచేందుకేనని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు జజ్జూరి జయంతిబాబు విమర్శించారు. సమావేశంలో భీమవరపు సుబ్బారావు, ఎంఎస్ సాయి, ఎల్.రాజశేఖర్, సీహెచ్ సాగర్ పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఒంగోలు సిటీ: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం హాల్‌టికెట్లను ఆన్‌లైన్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓఎస్ఎస్.ఓఆర్‌జీ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు



అక్రమాలలో మేటీలు

ఉపాధి హామీ పథకం అధికార కూటమి పార్టీల నేతల అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. వలసల నివారణ, కోరిన ప్రతి ఒక్కరికీ పని కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ పథకాన్ని ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆ పార్టీ నేతల జేబులు నింపనున్నాయి. శ్రమశక్తి సంఘాలు, మేట్లు నియామకాల పేరుతో నిధులు మింగేసేందుకు రంగం సిద్ధమైంది.

- శ్రమశక్తి సంఘాలు, మేట్లపేరుతో అక్రమాలకు రాచమార్గం
- మేట్లకు గౌరవ వేతనం పేరుతో రూ.కోట్లు స్వాహా
- వారి చేతిలోనే హాజరు, ఆన్‌లైన్, కూలీల వేతనాల సిఫార్సు
- అధికార పార్టీవారే ఉండాలంటూ ఎమ్మెల్యేల ఆదేశం
- త్వరలో పూర్తికానున్న ప్రక్రియ
- అక్రమాల కారణంగా ఈ వ్యవస్థను ఎత్తేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

బేస్తవారిపేట:

కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో శ్రమశక్తి సంఘాల ఏర్పాటు, మేట్ల వ్యవస్థను తీసుకొచ్చి అక్రమాలకు రాచమార్గం వేసింది. ఫలితంగా ఈ పథకం లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. ఇప్పటికే కొందరు నాయకులు బోగస్ మస్టర్లతో కూలీల పొట్టకొడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పనులను కూడా కేవలం కూటమి సానుభూతిపరులకే కేటాయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 2014–19 వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో అక్రమాలు చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. కాంపొనెంట్ పనుల్లో 50 శాతం నిధులు స్వాహా చేశారని కూలీలే చెప్పుకున్నారు. అప్పుడు కూడా శ్రమశక్తి సంఘాలు, మేట్లను ఏర్పాటు చేసి దోచిపెట్టారు. పనులు చేయకుండా పైపై పూతలతో బిల్లులు చేసుకుని జేబులు నింపుకున్నారు. జిల్లాలోని 38 మండలాల్లో మొత్తం 4.41 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో 3.82 లక్షల కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. 8.13 లక్షల మంది కూలీలు ఉండగా, వీరిలో 6.78 లక్షల మంది కూలీలు యాక్టివ్‌గా ఉన్నారు. 6.78 లక్షల మంది కూలీలకు 13,560 మంది మేట్లను నియమించే అవకాశం ఉంది. అయితే, 1,01,750 మంది కూలీలకు 2,631 మేట్లను నియమించారు. ఉపాధి హామీ నిధులతో సీసీ, బీటీ రోడ్ల పనులు, గోకులం షెడ్లు, పచ్చ గడ్డి పెంపకం, ఇంకుడు గుంతల పనులన్నీ అధికార కూటమి నేతలు తమకు నచ్చిన వారికి కేటాయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మేట్ పేరుతో దోపిడీ...

జిల్లాలో ఇప్పటివరకూ 2,631 శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేశారు. ఈ సంఘంలో 25 నుంచి 50 మంది ఉంటారు. ఇందులో ఒకరిని లీడర్‌గా నియమిస్తారు. ఆయన్ను మేట్ అంటారు. కూలీలను పనికి తీసుకెళ్లే బాధ్యత మేట్‌దే. మేట్ కూడా కూలీలతో పాటు పనిచేయాల్సిందే. కానీ, పనిచేయకుండానే వేతనం పొందుతారని కూలీలే చెబుతున్నారు. కూలీలపై అజమాయిషీ చెలాయిస్తారు. ఉపాధి కూలీల హాజరు, ఆన్‌లైన్ చేయడం, వేతనాల సిఫార్సు మొత్తం వీరే చేస్తారు. తమకు నచ్చిన వారికి పని కల్పించడం, పనులకు హాజరుకాకపోయినా మస్టర్లు వేయడం, ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడే అవకాశం ఉంది. కొత్తగా నియమించే మేట్లు అందరూ టీడీపీ కార్యకర్తలే ఉండాలని ఎమ్మెల్యేలు అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. రెండువారాల కిందట ఈ ప్రక్రియ ప్రారంభమైంది. త్వరలో ప్రక్రియ మొత్తం పూర్తి చేయడానికి గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫీల్డ్ అసిస్టెంట్లు, శ్రమశక్తి సంఘాల లీడర్ల ఆధ్వర్యంలోనే ఉపాధి పనులు జరుగుతాయి. ఇప్పటికే అనేక చోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి కూటమి కార్యకర్తలను నియమించారు. లీడరుగా ఉన్నందుకు మేట్‌కు ఒక కూలీపై రోజుకు రూ.1.50 చొప్పున చెల్లిస్తారు. యాక్టివ్‌గా ఉన్న కూలీలు 6.78 లక్షల మంది. దానిప్రకారం రోజుకు మేట్లకు సుమారు రూ.10.17 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. 100 రోజులకు దాదాపు రూ.10 కోట్లపైనే వీరికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ రకంగా కూటమి ప్రభుత్వం దోపిడీకి తెరతీసింది.

అక్రమాలకు చెక్ పెట్టిన గత ప్రభుత్వం...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగే అక్రమాలకు చెక్ పెట్టింది. 2015 వరకు ఉపాధి హామీ పథకం వ్యవహారాలన్నీ టాటా కన్సల్టెన్సీ సర్వీస్ సాఫ్ట్‌వేర్‌లో జరిగేవి. ఇవి పారదర్శకంగా లేకపోవడంతో గత ప్రభుత్వం నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ సాఫ్ట్‌వేర్‌కు మార్చింది. దీంతో పాటు శ్రమశక్తి సంఘాలు, మేట్ల వ్యవస్థకు మంగళం పాడింది. ఫలితంగా పెద్ద ఎత్తున అక్రమాలకు చెక్ పెట్టినట్లయింది.

చంద్రబాబు పాలనలో కక్షలు, అఘాయిత్యాలు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

- బరితెగించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ పోసానిని అరెస్ట్ చేశారు
- రైతులు, ప్రజల సమస్యలను విస్మరిస్తున్నారు
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ధ్వజం
- పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా



బూచేపల్లి వెంకాయమ్మ, మేరుగు నాగార్జునను సత్కరిస్తున్న నాయకులు

చీమకుర్తి: చంద్రబాబు 9 నెలల పాలనా కాలంలో కక్షలు, కార్పణ్యాలు, దాడులు, అమానుషాలు, అఘాయిత్యాలు తప్ప ప్రజలకు చేసిన మేలు ఏముందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ప్రశ్నించారు. చీమకుర్తిలోని బూచేపల్లి కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ చీమకుర్తి మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో మేరుగు నాగార్జున ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అడ్డంపెట్టుకుని టీడీపీ గూండాలు సాగిస్తున్న అరాచకం అంతాఇంతా కాదన్నారు. బుధవారం రాత్రి సినీ రచయిత, నటుడు పోసాని కృష్ణమురళిని అరెస్ట్ చేసిన విధానం ప్రజాస్వామ్యాన్నే అపహాస్యం పాలు చేసిందన్నారు. ఒంట్లో బాగలేదని టాబ్లెట్లు వేసుకుని వస్తానని చెప్పినా వినకుండా పోలీసులు వ్యవహరించిన తీరు సభ్యసమాజాన్ని ఉలిక్కిపడేలా చేసిందన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్ పాలన...

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో సాగించిన పాలనలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని మరిపించే విధంగా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగారన్నారు. రైతు భరోసా కేంద్రాలు, పెట్టుబడి సాయం, మద్దతు ధరలు అందించి రైతులను ఆదుకున్నారన్నారు. వ్యవసాయం అంటే పండుగ అనే విధంగా రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. అలాంటిది.. చంద్రబాబు వచ్చిన 9 నెలల కాలంలో రైతులకు పెట్టుబడి ఇవ్వకపోగా, దిగుబడి తగ్గి నష్టాల్లో కూరుకుపోయి విలవిల్లాడుతున్నా ఆదుకోకుండా విఫలమయ్యారన్నారు. రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని మేరుగు నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. సన్నకారు, చిన్నకారు, కౌలు రైతులు, కూలిరైతులు చంద్రబాబు పాలనలో పడుతున్న ఇబ్బందులు చెప్పనలవికానివన్నారు. చంద్రబాబు చేతగాని పాలన వలనే ఇదంతా జరుగుతోందని రైతులు వాపోతున్నారన్నారు. చంద్రబాబు పాలనలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలను తీవ్రంగా వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, సోషల్‌మీడియా కార్యకర్తలకు పార్టీ తరఫున జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో మళ్లీ తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందన్నారు. అప్పటి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని మనోధైర్యం కల్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం బూచేపల్లి వెంకాయమ్మ, మేరుగు నాగార్జునను పార్టీ మండల నాయకులు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్‌బాబు, చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్య పరిష్కరించాలి

ఒంగోలు సిటీ: మార్కాపురం ఎయిడెడ్ ఉపాధ్యాయుల జాయినింగ్ సమస్యను డీఈఓ కిరణ్‌కుమార్ తక్షణమే పరిష్కరించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్కాపురం ఆజాద్ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయులు ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నారని, వారిని మార్కాపురం మండల ఎంఈఓ రిలీవ్ చేసి ఫిబ్రవరి 25న తర్లుపాడు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలకు పంపించారని తెలిపారు. ఆ పాఠశాల యాజమాన్యం వారిని విధుల్లో చేర్చుకోలేదన్నారు. ఆ మండల ఎంఈఓ ఆ ఉపాధ్యాయులను మీరు డీఈఓ దగ్గరకి వెళ్లాలని చెప్పారన్నారు. రిలీవ్ చేసే ఎంఈఓలు జాయిన్ చేసుకునే విషయంలో సమస్య పరిష్కరించాలేగానీ.. ఉపాధ్యాయులను డీఈఓ దగ్గరకు వెళ్లమని చెప్పడం సరికాదన్నారు.

నేత్రోత్సవం..





పొదిలిలోని దర్శి రోడ్డులో సాగుతున్న రథోత్సవం (ఇన్‌సెట్‌లో) రథంపై భక్తులకు దర్శనమిస్తున్న గౌరీశంకరులు

రథోత్సవం.. భక్త జన సంద్రం..

- భక్తులతో కిక్కిరిసిన పొదిలి పట్టణం
- మార్మోగిన శివనామస్మరణ

పొదిలి: హరహర మహాదేవ.. శంభోశంకర అంటూ వేలాది మంది భక్తుల నినాదాల మధ్య నిర్మమహేశ్వరస్వామి రథోత్సవం కన్నుల పండువలా సాగింది. దక్షిణ కాశీగా పేరొందిన పొదిలి పట్టణంలోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీనిర్మమహేశ్వరస్వామి రథోత్సవం గురువారం మధ్యాహ్నం నుంచి అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలో వేకువజాము నుంచే స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులుదీరారు. ఉభయ దాతలు, ప్రముఖులకు ఆలయ అధికారి నర్రా నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ దాతల ప్రత్యేక పూజల అనంతరం రథ నిర్మాణ దాత శామంతపూడి నాగేశ్వరరావు రథంపై ఉండి సూచనలు చేస్తుండగా రథోత్సవం ప్రారంభమైంది. రథాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి అందులో స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచారు. పట్టణంలోని మాడవీధుల్లో భక్తుల జయజయ ధ్వానాల మధ్య రథోత్సవం సాగింది. వేల సంఖ్యలో వచ్చిన భక్తులు హర హర మహాదేవ అంటూ రథాన్ని లాగారు. రథ చక్రాల కింద వందలాదిగా గుమ్మడికాయలను భక్తులు ఉంచారు. తమ గృహాల ముందుకు రథం వచ్చినప్పుడు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. చిన్న బస్టాండ్, ప్రధాన రహదారి, పెద్ద బస్టాండ్, దర్శి రోడ్డు మీదుగా రథోత్సవం ముందుకు సాగగా, మహిళలు, యువతీ యువకులు సైతం ఉత్సాహంగా రథం లాగేందుకు పోటీ పడ్డారు. రథంపై ఊరేగింపుగా వస్తున్న గౌరీశంకరులను వేలమంది భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కొనసాగిన ఆనవాయితీ...

రథం దర్శి రోడ్డువైపు వచ్చేసరికి మహిళలు రథం లాగడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సంవత్సరం కూడా మహిళలు ఉత్సాహంగా పాల్గొని రథం లాగారు. పురుషులు రథం లాగడం ఆపి మహిళలకు అవకాశం ఇచ్చారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని రథం లాగేందుకు ఉత్సాహం చూపారు.

బందోబస్తును పరిశీలించిన ఎస్పీ...

రథోత్సవం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును ఎస్పీ ఏఆర్ దామోదర్ స్వయంగా పరిశీలించారు. పోలీసులకు పలు సలహాలు, సూచనలు చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు వేమన, బ్రహ్మనాయుడు వారి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



రథోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తులు

వైభవం.. ఆది దంపతుల కల్యాణం



సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో శివ పార్వతుల కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

ఒంగోలు మెట్రో: మహాశివరాత్రి పండుగ మరుసటి రోజైన గురువారం జిల్లావ్యాప్తంగా శివపార్వతుల కళ్యాణాలను కన్నుల పండువలా నిర్వహించారు. అత్యంత భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా కళ్యాణోత్సవాలు జరిగాయి. ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండ్ వద్ద తూర్పుపాలెంలో గంగాపార్వతీ సమేత శ్రీరాజరాజేశ్వరి దేవస్థానం (శివాలయం)లో, సమతానగర్లో సాగర కాలువ దగ్గర దుర్గామల్లేశ్వరి దేవస్థానంలో, మామిడిపాలెం, గద్దలగుంట, పేర్నమిట్ట, త్రోవగుంట, కొప్పోలు, పెళ్లూరు శివాలయాలలో వైభవంగా స్వామివారి కల్యాణోత్సవాలు జరిగాయి. ఒంగోలు కేశవస్వామిపేటలోని కాశీవిశ్వనాథుని ఆలయంలో, పాపాకాలనీ శివాలయంలో, బాలాజీరావుపేట దుర్గామల్లేశ్వరి దేవస్థానంలోనూ శివపార్వతుల కల్యాణాలు నిర్వహించారు. లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న శివాలయంలో శివపార్వతుల కళ్యాణంలో దంపతులుగా షిరిడీ సాయి కల్చరల్ మిషన్ కమిటీ సభ్యులు రుద్రవరపు సాయిబాబు, లక్ష్మి దంపతులు, అంజిరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. మంగమూరు రోడ్డు గాంధీనగర్ భగవాన్ సత్యసాయి బాబా మందిరంలో దేవస్థానం కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రముఖ వేద పురోహితులు వ్యాజాల ప్రసన్న కుమార్ దంపతులచే కళ్యాణం జరిపించారు. సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి శివాలయంలో ఆలయ నిర్వాహకులు అలహరి చంచలరావు ఏర్పాటు చేసిన వేదికపై శివపార్వతుల ఉత్సవమూర్తులను చూడచక్కగా అలంకరించారు. ప్రముఖ వేద పురోహితులు, బ్రహ్మశ్రీ మఠంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో దంపతులచే ఆద్యంతం నయన మనోహరంగా భక్తి రసభరితంగా కల్యాణ క్రతువులను ఆలయ అర్చకులు నిర్వహించారు. భారీగా భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ప్రముఖ శైవక్షేత్రాల ఆధ్వర్యంలో శివపార్వతుల నగరోత్సవం నిర్వహించారు.



శివపార్వతుల కళ్యాణంలో భారీగా పాల్గొన్న భక్తులు

కట్టుకథలు చెప్పొద్దు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

యర్రగొండపాలెం: ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా కట్టుకథలు చెబుతూ కాలక్షేపం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కేవలం సచివాలయాల ఉద్యోగులు ఇచ్చిన నివేదికలపై ఆధారపడకుండా మండల స్థాయి అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. వేసవి సమీపిస్తుండటంతో గ్రామాల్లో ఉన్న తాగునీటి సమస్యపై దృష్టి సారించాలని, ఆయా ప్రాంతాల పరిస్థితి ఆధారంగా డీప్‌బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, ట్యాంకర్ల సరఫరాలో సహేతుకత ఉండాలన్నారు. నీటి సరఫరాలో అవకతవకలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తాగునీటి నిర్వహణలో నిర్లక్ష్యం ఉండరాదని, క్లోరినేషన్‌తో పాటు అవసరమైన పరీక్షలు నిర్వహించాలన్నారు. నీళ్లు లేవని ప్రజల నుంచి ఫిర్యాదులు, ఆందోళన చేసే పరిస్థితి తలెత్తితే ఆయా మండలాల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో పాటు ఎంపీడీఓలపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తాగునీటి సమస్యపై స్థానిక ప్రజలతో అధికారులు మాట్లాడాలని ఆమె దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం కూడా ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని, 10 రోజుల్లో అన్ని డంపింగ్ యార్డులు వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. పీ–4సర్వే మొక్కుబడిగా కాకుండా పకడ్బందీగా నిర్వహించి, ఈ సర్వే ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఫారంపాండ్స్, ఇంకుడు గుంతల ఉపయోగాల గురించి రైతులకు, ప్రజలకు వివరించి వాటిని ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిస్సింగ్ సిటిజన్స్ సర్వే, ఆధార్ కార్డులులేని బాలలను గుర్తించి వారికి ఆధార్ కార్డులు అందే విధంగా చూడాలన్నారు. ముందుగా పట్టణంలోని మంచినీటి పథకాన్ని, మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణాన్ని, భూముల రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, సర్వే శాఖ సహాయ సంచాలకులు గౌస్‌బాష, నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సత్తా చాటిన బాపట్ల జిల్లా ఎడ్లు



మోక్షగుండంలో బండ లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా మండలంలోని మోక్షగుండంలో గురువారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన వీరయ్యస్వామి చౌదరి ఎడ్లు 2714 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా జిల్లెల్లకు చెందిన జిల్లెల నాగిరెడ్డి ఎడ్లు 2600 అడుగులతో ద్వితీయ, నంద్యాల జిల్లా పెసలవాయికి చెందిన కళాంబాషా ఎడ్లు 1100 అడుగులతో తృతీయస్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండు, మూడోవ బహుమతులుగా వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలను దాతలు అందచేశారు.

ధాన్యం రైతుకు దిక్కెవరు..?



కంకి నూర్పిడికి సిద్ధంగా ఉన్న వరిపొలాలు

జిల్లాలో ధాన్యం రైతు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. స్వేదాన్ని సత్తువుగా మార్చి పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధరలు కరువై..వచ్చిన అరకొర దిగుబడి పంటను ఏం చేయాలో తెలియక దళారులకు తెగనమ్ముకునే పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించి రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం చేష్టలుడిగా చూస్తుండటంతో దళారులు ధరలు దిగ్గోసి రైతులను దోచుకుంటున్నారు. రైతులకు అండగా ఉండాల్సిన వ్యవసాయ మార్కెట్ యార్డులు తమకేమీ సంబంధం లేదన్నట్లు తప్పుకుంటున్నాయి.

● దిగుబడి తగ్గి..గిట్టుబాటు ధరలు లేక దీన స్థితి
● కొనుగోలు కేంద్రాల ఊసే ఎత్తని ప్రభుత్వం
● రైతుల అవసరం ఆసరాగా దళారుల దోపిడీ..
● రైతులకు ఉపయోగపడని వ్యవసాయ మార్కెటింగ్ యార్డులు

సింగరాయకొండ:

పంట సాగులో తెగుళ్ల బెడద..తగ్గిన దిగుబడులు..ధరల లేమీ..కొరవడిన ప్రభుత్వ సహకారం..ఏం చేయాలో తెలియని దిక్కుతోచని పరిస్థితి...ఇది ప్రస్తుతం జిల్లాలో వరి సాగు చేసిన రైతుల దీనస్థితి. గతంలో ఎకరాకు 40 నుంచి 45 బస్తాలు వచ్చే దిగుబడి ఈ ఏడాది 25 నుంచి 30 బస్తాలకు పడిపోయింది. ఇక ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మిల్లర్లు సిండికేట్‌గా మారి రైతులను అందిన కాడికి దోచుకుంటున్నారు. పంటను దళారులకు విక్రయించకుండా మార్కెటింగ్ యార్డుల్లో నిల్వ ఉంచుకుందామనుకున్నా ఆ అధికారులు కుంటిసాకులు చెబుతూ రైతులకు మొండి చేయి చూపుతున్నారు.

వేల ఎకరాల్లో వరిసాగు

కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 10 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. కానీ రికార్డుల ప్రకారం కేవలం 5 వేల ఎకరాల్లో సాగు చేసినట్లు అధికారులు తెలియజేస్తున్నారు. నియోజనకవర్గంలో అత్యధికంగా సింగరాయకొండ మండలంలో సుమారు 5 వేల ఎకరాల్లో వరిసాగు చేయగా మిగిలిన మండలాల్లో మిగిలిన 5 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ సంవత్సరం నెల్లూరు మసూర, ఎఎన్ఎం, షుగర్‌లెస్, జీలకర మసూర రకం సాగు చేశారు. ఎకరా సాగుకు సుమారు రూ.30 వేల నుంచి రూ.32 వేల వరకు ఖర్చయిందని రైతులు చెబుతున్నారు.

భారీగా తగ్గిన దిగుబడి..

ఈ ఏడాది ఎకరాకు కేవలం 25 నుంచి 30 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు కురిసినా అదునులో కాకుండా ఆలస్యంగా కురవటంతో అదునులో ఎరువులు వేసుకునే అవకాశం లేకపోవటంతో ఉల్లికోడు, మానిపండు తెగుళ్లు కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గింది. గతంలో నెల్లూరు జీలకర రకం సాగు చేయగా ఈ ఏడాది దిగుబడి బాగా వస్తుందని తెలంగాణాకు చెందిన కేఎన్ఎం రకం సాగుచేశారు. అయితే 40 పైగా పంట పండాల్సి ఉండగా కేవలం 25 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. కానీ పెట్టుబడి మాత్రం పెరిగింది.



యంత్రాలతో ధాన్యం రాశిగా పోస్తున్న దృశ్యం

జాడ లేని కొనుగోలు కేంద్రాలు

ప్రస్తుతం ధాన్యం కోతలు జోరుగా సాగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారులు ధాన్యం కొనుగోలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో పాటు ఆర్‌బీకేలు, సహకార సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతుకు గిట్టుబాటు ధర దక్కేలా చేసి చేశారు. వాస్తవానికి వరి గిట్టుబాటు ధర క్వింటా రూ.2,300 ఉండగా ప్రస్తుతం కేవలం రూ.1,600లకు మాత్రమే మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. నియోజకవర్గంలో స్థానికంగా ఉన్న మిల్లర్లతో పాటు నెల్లూరు జిల్లా నుంచి కూడా మిల్లర్లు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కానీ వీరంతా సిండికేట్‌గా మారి ఒకే మాటపై ధరలు దిగ్గోస్తున్నారు. 75 కేజీల నెల్లూరు మసూరా రకం రూ.1350, కేఎన్ రకం రూ.1600, సుగర్ లెస్ రూ.1650లకు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఖర్చులు, తరుగు కింద బస్తాకు మూడు కేజీల తరుగు, రవాణా ఖర్చులు రూ.40, కమీషన్ రూ.20, గోతంకు ఒక కేజీ తరుగు లెక్కిస్తున్నారని ఈ ప్రకారం బస్తాకు రూ.160 ఖర్చవుతుందని, చివరికి చేతికి నెల్లూరు మసూరాకు రూ.1,190, మిగిలిన రకాలకు రూ.1,440 మాత్రమే లభిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం షుగర్‌లెస్ రకం దిగుబడి 30 బస్తాలు రాగా బస్తా రూ.2,500లకు అమ్ముకున్నామని, ఈ ఏడాది బస్తాకు 800 నుంచి రూ.1000 తక్కువగా వస్తుందని, దీంతో పెట్టుబడులు కూడా పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో వాట్సప్ మెసేజ్ చేస్తే చాలు మీ పొలం దగ్గరికి ఒక్క అరగంటలో లారీ వస్తుందని కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రచారం చేశారని, కానీ ప్రస్తుతం ప్రభుత్వం ఏప్రిల్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, అప్పటి వరకు ఆగాలని చెబుతున్నారని వాపోతున్నారు.

రైతులకు దూరంగా మార్కెటింగ్ యార్డులు..

వ్యవసాయ మార్కెటింగ్ యార్డుల్లో రైతు బంధు పథకం అమల్లో ఉంటుందని అధికారులు చెప్పటమే తప్ప అమలులో లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండపి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న గోడౌన్‌ను పౌరసరఫరాల శాఖకు పదేళ్ల లీజు పద్ధతిపై ఇచ్చారు. అయితే ఈ గోడౌన్‌లు ధాన్యం నిల్వలకు అనుకూలంగా లేవని, వర్షం కురిస్తే రైతులకు ఇబ్బందని సిబ్బంది చెబుతున్నారు. వాస్తవానికి గతంలో గోడౌన్లను ధాన్యం నిల్వచేయటానికి అనుకూలంగా మరమ్మతులు చేశారనిఐ బియ్యం నిల్వ చేసినప్పుడు ధాన్యం నిల్వ ఎందుకు చేయకూడదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ధరలు మరీ దారుణం:



నాలుగు ఎకరాల్లో నెల్లూరు జీలకర రకం సాగు చేశాను. 75 కేజీల బస్తా రూ.1400 కొంటున్నారు. అందులో 3 కేజీల తరుగు, రూ.50 రవాణా ఖర్చులు, కమీషన్ రూ.20, గోతం ఖర్చు ఒక కేజీ ఈ లెక్కన సుమారు రూ.160 రూపాయలు పోను చివరికి రూ.1,240 చేతికి వస్తాయి. ఈ డబ్బులు కూడా ఎప్పుడు ఇస్తారో అర్థం కావడం లేదు.

తుమ్మకూరి యానాది, రైతు, బింగనపల్లి

బస్తాకు రూ.500 తగ్గింది:



8 ఎకరాల్లో షుగర్ లెస్ రకం వరి ధాన్యం సాగు చేశాను. 20 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రస్తుతం 75 కేజీల బస్తా ధర ఖర్చులు పోను కేవలం రూ.1,520 మాత్రమే దక్కుతుంది. గత ఏడాది బస్తా రూ.2 వేల వరకు కొనుగోలు చేశారు. దిగుబడి కూడా 30 బస్తాలకు పైగా వచ్చింది.

సామంతుల మురళీ కృష్ణారెడ్డి, రైతు, బింగినపల్లి



ట్రాక్టర్లతో ధాన్యం రవాణా

వైభవంగా కల్యాణోత్సవం

కొత్తపట్నం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం వేకువ జామున కల్యాణోత్సవం వైభవంగా సాగింది. గ్రామ పెద్దలు, ఈవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామిలకు పూజలు చేసి కల్యాణోత్సవం నిర్వహించారు. కొత్తపట్నం నాగేశ్వరస్వామి ఆలయంలో ఈవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శివ, పార్వతలకు కల్యాణం నిర్వహించారు. దంపతులు కల్యాణం ముందు పూజలు చేశారు. భక్తులు ఓం నమశివాయ.. హర హర మహాదేవ శంభోశంకర అంటూ ఒక్కసారిగా పోటెత్తారు. ఆలయం ప్రాంగణంలో భక్తులు బారులు తీరారు. పూజలు అనంతరం భక్తులు సముద్రస్నానాలు చేసిన అనంతరం ఆలయానికి వచ్చి దర్శనం చేసుకున్నారు. తీర్థప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.



మడనూరులో రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వాముల కల్యాణోత్సవం



హాజరైన భక్తులు

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

● ఎస్పీ ఏఆర్ దామోదర్

పొదిలి/కొనకనమిట్ల: పోలీస్‌స్టేషన్ల పరిధిలో పెండింగ్ కేసులపై దృష్టి సారించి వేగంగా దర్యాప్తు చేపట్టాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. కొనకనమిట్ల, పొదిలి పోలీస్‌స్టేషన్లను గురువారం ఆయన పరిశీలించారు. లా అండ్ ఆర్డర్, నేర నియంత్రణ వ్యూహాలపై ఆయన అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. స్టేషన్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను, విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరును, డ్యూటీల కేటాయింపులు, మహిళా సహాయ కేంద్రం, ఫిర్యాదుల స్వీకరణ అంశాలు, రికార్డులు పరిశీలించారు. స్టేషన్‌లలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, ఇతర ప్రాధాన్య అంశాలపై ఆరా తీశారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదం చేస్తాయని, గ్రామాల్లో అవసరమైన చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సర్కిల్ కార్యాలయం నూతన భవనాన్ని సందర్శించారు. చేయాల్సిన మార్పులు, చేర్పులపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరిగే రథోత్సవ బందోబస్తును పరిశీలించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవం మార్గం వద్ద భద్రతకు సంబంధించి బందోబస్తుపై అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవడంతో పాటు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. రథోత్సవం జరిగే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఆయన పరిశీలించారు. సీసీ, డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలపై వాహన దారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించి నియంత్రించాలని ఆదేశించారు. టెక్నాలజీని ఉపయోగించి నేరాలను నియంత్రించాలని సూచించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, దర్శి డిఎస్పీ లక్ష్మీనారాయణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు వేమన, బ్రహ్మనాయుడు ఉన్నారు.



పొదిలిలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

గిరిజనులను అడ్డుకున్న అటవీశాఖ అధికారులు

● నెక్కంటి బేస్ క్యాంపు వద్ద గిరిజనుల రాస్తారోకో..

పెద్దదోర్నాల: శ్రీశైలంలో దైవదర్శనం అనంతరం స్వస్థలాలకు అటవీ మార్గంలో వెళ్లేందుకు ప్రయత్నించిన గిరిజనులను అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని నెక్కంటి బేస్ క్యాంపు వద్ద గురువారం జరిగింది. వివరాల్లోకి ..నియోజకవర్గంలోని పాలుట్ల, నెక్కంటికి చెందిన గిరిజనులు శ్రీశైలంలో దైవదర్శనం ముగించుకుని స్వస్థలాలకు బయలు దేరారు. ఈ క్రమంలో వారికి అత్యంత సమీపంలోని ఇష్టకామేశ్వరి అలయానికి వెళ్లే రహదారిలో వెళ్లేందుకు ప్రయత్నించడంతో అక్కడే ఉన్న అటవీశాఖ అధికారులు వీరిని అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన గిరిజనులు తాము ఎన్నేళ్ల నుంచో ప్రయాణాలు చేసే దారిలో వెళ్లేందుకు మీ అనుమతులు ఎందుకంటూ వారితో వాదనకు దిగారు. అయినా అధికారులు పట్టు వదలకపోవటంతో వారు శ్రీశైలం రహదారిలో రాస్తారోకో చేపట్టంతో ఆ రహదారిలో వాహనాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో దిగివచ్చిన అధికారులు గిరిజనులను అటవీ మార్గంలో ప్రయాణించేందుకు అనుమతి ఇవ్వటంలో ఆందోళన సద్దుమణిగింది.



నెక్కంటి బేస్ క్యాంపు వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించాలి

మద్దిపాడు: ప్రభుత్వ భూముల్లో ఎలాంటి ఆక్రమణలు ఉన్నా వెంటనే తొలగించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మండల అధికారులను ఆదేశించారు. మండలంలోని జువ్విగుంటలో భూముల రీ సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో తొలుత విలేజ్ బౌండరీ, బ్లాక్ బౌండీరీ, ప్రభుత్వ భూములను హద్దులు పూర్తి చేసిన తర్వాతే పట్టా భూములను ప్రారంభించాలన్నారు. పట్టాదారు సమక్షంలో మాత్రమే భూములు సర్వే చేయాలన్నారు. సుదూర ప్రాంతంలో నివసిస్తున్న రైతుల వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేసి వారికి వాట్సప్ ద్వారా సమాచారం ఇచ్చి వారు రీ సర్వేలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ జ్వాలా నరసింహారావు, డీటీ నాగరాజు, సర్వేయర్ బాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.



జువ్విగుంట రీ సర్వేను తనిఖీ చేస్తున్న జేసీ

టంగుటూరు: మండలంలోని కొణిజేడు గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను జేసీ గోపాలకృష్ణ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు, సిబ్బందికి సూచనలుచేశారు. తహసీల్దార్ ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు



ఉత్సాహంగా బండ లాగుతున్న ఎడ్లు

కొనకనమిట్ల: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వాగుమడుగు పంచాయతీ అంబాపురంలో గురువారం రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అంబాపురంలోని అంబబాల సంగమేశ్వరస్వామి ఆలయం ఆవరణలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పాలపండ్ల విభాగం నుంచి ఆరుబంట సైజు వరకు (12క్వింటాల బండ) ఎడ్ల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా దాతల సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పశు ప్రదర్శన పోటీలు రైతులకు ఎంతగానో ఉత్సాహం నింపుతాయన్నారు. ఎడ్ల పోటీలను తిలకించేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పోటీల్లో కంభం మండలం ఎల్‌కోటకు చెందిన ఉలవల హరికృష్ణ ఎడ్ల జత 2550 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. అదే విధంగా పొదిలి మండలం రాములవీడుకు చెందిన సలగాల శ్రీవర్ధన్, నాగరాజుకుంటకు చెందిన కుదుముల లక్ష్మిరెడ్డిల సంయుక్త ఎడ్ల జత 1393 అడుగులు లాగి రెండ వ స్థానంలో నిలిచాయి. పొదిలి మండలం రాములవీడుకు చెందిన గుంటూరి బాలయ్య, తాళ్లూరు మండలం లక్కవరానికి చెందిన కె.నరసింహారావుల సంయుక్త ఎడ్ల జత 1350 అడుగులు లాగి మూడవ స్థానంలో నిలిచాయి. అంబాపురంకు చెందిన మాదాల నాగమల్లేశ్వరి ఎడ్ల జత 1262 అడుగులు లాగి నాల్గవస్థానంలో నిలిచాయి. మొదటి, రెండు, మూడు బహుమతులను రూ.30వేలు, రూ.20వేలు, రూ.10 వేలను దాతలు చెన్నెబోయిన తిరుపాలు, కొల్లెబోయిన నడిపి వెంకటేశ్వర్లు, పెరికె రత్నంలు యజమానులకు అందజేశారు.